క్లుప్తంగా

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో మిగిలి ఉన్న సీట్లకు నాల్గో విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఐటీఐ కన్వీనర్ జయమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 20వ తేదీ వరకు అవకాశం ఉందని నేరుగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మిగతా వివరాలకు సెల్: 8096402785, 9441784176 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

9న అవగాహన సదస్సు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం వద్ద కొల్లాపూర్ కోర్టు సివిల్ జడ్జి వీఎస్ఎస్ మిథున్ తేజ అధ్యక్షతన దివ్యాంగులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పారాలీగల్ వలంటీర్ ఎం శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉదయం 8 గంటల వరకు సదస్సు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

పంట రుణమాఫీ కోసమే కుటుంబ సభ్యుల నిర్ధారణ



పెద్దకొత్తపల్లి: రుణమాఫీ కోసం రేషన్ కార్డు లేని వారి కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం శుక్రవారం అధికారులు రైతులతో సెల్ఫీలు దిగి ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికల వద్ద వ్యవసాయాధికారి శిరీష రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రేషన్ కార్డు లేని వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ ముజీబ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు చేయూత



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కెనరా బ్యాంకు చేయూతనందించింది. శుక్రవారం పాఠశాలకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.40 వేలు విలువ చేసే టేబుల్స్, అల్మారాలు, గ్రంథాలయానికి సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ రాఘవేందర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసూన, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రాకపోకలకు ఆటంకం

పెద్దకొత్తపల్లి: మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని చెరువు, కుంటలు అలుగులు పారుతున్నాయి. వెన్నచర్ల చెరువు అలుగు పారడంతో నక్కలపల్లి నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 101 చెరువు, కుంటలు, 12 నోటిఫైడ్ చెరువులు అలుగులు పారుతున్నాయి.

పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట రూరల్: పట్టణంలోని భక్త మార్కండేయ పద్మశాలి కమ్యూనిటీ హాలులో శుక్రవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా దాసుపత్రి శకుంతల, ప్రధాన కార్యదర్శిగా వనం గీత, కోశాధికారిగా గుర్రం హైమావతి, ఉపాధ్యక్షురాలుగా కల్యాణి, నిర్మల, కార్యదర్శులుగా నారాయణమ్మ, రాజేశ్వరి, సభ్యులను, సలహాదారులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు పులిజాల శ్రీనివాసులు, కోట కిశోర్, పర్వతాలు, ధన్‌రాజ్, నిర్మల, శ్రావణి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం..

కల్వకుర్తిరూరల్: పట్టణంలో విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీని రాష్ట్ర కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా యాదయ్య, అధ్యక్షుడిగా శ్రీనివాసాచారం, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా మల్లేష్, యుగంధర్, ప్రచార కార్యదర్శిగా భిక్షపతి, కోశాధికారిగా హరీష్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందించారు. గంగాధరాచారి, తదితరులు పాల్గొన్నారు.

రూ. 2 లక్షలు అందజేత

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన కొమ్ము దశరథం నాలుగు నెలల కిందట మృతిచెందాడు. దీంతో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు మృతుడి భార్య సుభద్రమ్మ ఖాతాలో శుక్రవారం డబ్బులు జమచేసినట్లు ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు.

13 మంది బైండోవర్

నాగర్‌కర్నూల్ క్రైం: గ్రామంలో చిన్న,చిన్న విషయాలకు గొడవలు చేస్తు ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తున్న 13 మందిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. బొందలపల్లి బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి చెందిన మాదవరెడ్డిలు ఇరువులు రాజకీయ లబ్ధికోసం గ్రామంలో గొడవలు చేస్తూ ఇతరులకు ఇబ్బంది కల్గిస్తున్నారు. దీంతో వారితో పాటు మరో 11మందిపై పిట్టి కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు తెలిపారు.



అచ్చంపేట అంజనీమాత సేవా సమితి ఆధ్వర్యంలో...



కల్వకుర్తిలో..



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న జ్ఞానవికాస భారతి సంస్థ సభ్యులు

మట్టి గణనాథులను పూజిద్దాం

నాగర్‌కర్నూల్: వాడవాడలా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజిద్దామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి గణనాథుల విగ్రహాల పంపిణీని ఆయన హాజరై ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో జ్ఞాన వికాస భారతీ సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణనాథ విగ్రహాలను పంపిణీ చేశారు. కౌన్సిలర్ కొత్త శ్రీనివాసులు, అధికారులు, ఉద్యోగులు, జ్ఞాన వికాస భారతీ ఉపాధ్యక్షురాలు సోమ ప్రగతి గౌడ్, జనరల్ సెక్రెటరీ సుధారాణి,ప్రచార కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రక్షిత మహిళా సొసైటీ, అంజనీమాత, కళాంజలి వస్త్ర దుకాణంతో పాటు వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ సత్యం పట్టణవాసులకు మట్టి గణపతులను అందజేశారు. వైస్ చైర్మన్ షాహెద్, కమిషనర్ మహమూద్ షేక్, ఏఈ షబ్బీర్ అహ్మద్, మేనేజర్ రాజకుమారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో, అదేవిధంగా రాజవీధిలో రవి ఆచారి కుటుంబ సభ్యులు మట్టి వినాయకులను పంపిణీ చేపట్టారు. కౌన్సిలర్ నయూమ్ ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన

కోడేరు: రాజాపూర్ పాఠశాలలో జెడ్పీ ఉన్నత పాఠశాల జీవన శాస్త్రం ఉపాధ్యాయుడు శ్రీశైలం మట్టి గణనాథులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బంకమట్టిని సేకరించి మట్టి వినాయకులను తయారు చేసే విధానాన్ని చూయించారు. అంజనేయులు, జక్కయ్య, మల్లికార్జున్, ప్రభాకర్, శ్రీశైలం, శ్రీలత, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: పట్టణంలో వాసవీ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి వినాయకులను సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరు రమేష్‌బాబులు పంపిణీ చేశారు. కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి రాజు, శివ, జగదీశ్వర్, మాజీ ఎంపీటీసీ గోపాల్, శ్రీనివాస్, ఆంజనేయులు, రాకేశ్, తిరుపతయ్య, నరేష్, నర్సింహయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలి



వెల్దండ/చారకొండ/కోడేరు: ప్రశాంత వాతావరణంగా వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, చారకొండ ఎస్ఐ వెంకట్ రెడ్డి, కోడేరు ఎస్ఐ గోకారి అన్నారు. శుక్రవారం వెల్దండ సీఐ కార్యాలయంలో సీఐ, చారకొండ, కోడేరు మండల కేంద్రాల్లో ఎస్ఐలు మాట్లాడారు. మండపాల పేర్లను పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. ఎస్ఐ కురుమూర్తి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అమ్మకానికి సిద్ధంగా ..



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి. పలు కూడళ్లలో యువకులు సందడి చేశారు.



నాగర్‌కర్నూల్‌లో..

సర్వాంగ సుందరంగా మండపాలు ముస్తాబు

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలో గణేశ్ ఉత్సవాలు నిర్వహించే ఉత్సవ కమిటీలు మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరించి సిద్ధం చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా మండపాలను విద్యుద్దీపాలతో, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఇప్పటికే గణేశ్ విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు బ్యాండు మేళం, డీజేలతో గ్రామానికి ప్రత్యేకంగా తరలిస్తున్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో వినాయక మండపాలను సిద్ధం చేస్తున్నారు. మండపాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. 9 రోజుల పాటు గణనాథుడు పూజలు అందుకోనున్నారు. వినాయక కొనుగోలుదారులతో మార్కెట్‌లు ప్రజలతో కిటకిటలాడాయి.

పెద్దకొత్తపల్లి: వినాయక చవితి సందర్భంగా వాడవాడన గణనాథులను ఏర్పాటు చేసే పనిలో యువకులు నిమగ్నమయ్యారు. గ్రామాలలో వీధుల కూడళ్లలో మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. వినాయకులను కొనుగోలు చేసుకొని సంబురంగా గ్రామాలకు తీసుకెళ్తున్నారు.



కల్వకుర్తిలో..

బకాయిలు చెల్లించాలి

లింగాల: గురుకుల పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు వెంటనే బకాయిలు చెల్లించాలని స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను శుక్రవారం స్వేరోస్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు 10 నెలల నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా నాయకులు మబ్బు రాము, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

'కాటమయ్య కిట్ల'పై అవగాహన

చారకొండ: కల్లు గీతా కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య కిట్లపై శుక్రవారం మండల కేంద్రంలో తాటివనంలో రాష్ట్ర ట్రైనింగ్ కోఆర్డినేటర్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఖాజానిజాం మాట్లాడుతూ త్వరలో కిట్లను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది నాయకులు, గీతాకార్మికులు తదితరులు ఉన్నారు.

జూపల్లి అరుణ్ జన్మదిన వేడుకలు



కొల్లాపూర్: పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద, ఎన్టీఆర్ చౌరస్తాలో మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. పార్టీ నాయకులు కేకును కట్‌చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు, వైస్ చైర్ పర్సన్ మహిమూదాబేగం, నాయకులు రహీంపాషా, వంగ రాజశేఖర్‌గౌడ్, శిరీషయాదవ్, పిన్నంశెట్టి జ్యోతి, పసుపుల నర్సింహా, ఎక్బాల్, కేతూరి ధర్మతేజ, నయూమ్, రాముడుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రాకపోకలు



కోడేరు: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షాలకు కుంటలు, చెరువులు అలుగులు పారుతున్నాయి. బావాయిపల్లి, కోడేరు, పస్పుల, ఖానాపూర్ వాగులు వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధాన వాగుల వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పనులకు నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తు చేసుకోండి

బల్మూర్: మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వరీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులుగా పని చేయుటకు అర్హులైన వారు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవి పరంగి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

లింగాల: మండలంలోని శాయిన్‌పేటకు చెందిన వివాహిత మహిళ సుమతి(35) ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం కుటుంబ కలహాలతో మహిళ పురుగుల మందు తాగి ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉంది. గమనించిన కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త చిన్న లచ్చగౌడు, ఇద్దరు సంతానం ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు.

బైరు మల్లయ్యకు నివాళి

చారకొండ: మండల కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, కల్లు గీతాకార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బైరు మల్లయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకట్ గౌడ్, బాల్‌రాం గౌడ్ , గీతాకార్మికులు తదితరులు ఉన్నారు.

ఆరోగ్య పాడి దినం

తెలకపల్లి: మండలంలోని చిన్నముద్దునూరులో శుక్రవారం ఆరోగ్య పాడి దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నీరు నిల్వకుండా చూడాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు పద్మ, బాలస్వామి, అంగన్‌వాడీ కార్యకర్తలు అలివేల పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం ప్రాథమిక పాఠశాలలో 90 మంది విద్యార్థులకు మాజీ మాచినేనిపల్లి సింగల్‌విండో చైర్మన్ సుధాకర్ రెడ్డి, అతని కుమారులు రూ. 8 వేలు విలువ చేసే నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవిందర్ రెడ్డి, శశిధర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ బీమా తప్పనిసరి



అచ్చంపేట: ప్రతిఒక్కరికి బీమా తప్పనిసరి అని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయంలో నిర్వహించిన బీమా వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు అండగా నిలుస్తున్న ఎల్‌ఐసీ సేవలను ఆయన కొనియాడారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, క్విజ్ పోటీల్లో గెలుపొందిన ఏజెంట్లకు చైర్మన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ వెంకన్న, ఏఓ చంద్రశేఖర్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, లియాఫీ నాయకులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

వెల్దండ: చోరీకి గురైన నాలుగు సెల్‌ఫోన్లను రికవరి చేసి బాధితులకు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా, చేవెళ్లకు చెందిన యాదగిరి, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండకు చెందిన జితేందర్‌రెడ్డి, మాదారంకు చెందిన మల్లేష్, వనపర్తి జిల్లా గణేష్‌లకు సంబంధించిన ఫోన్లను వారికి అప్పగించినట్లు వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఆంజనేయులు, కిషోర్‌రెడ్డి, మురళి, జానకిరామ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

గాంధీ హైస్కూల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు



కొల్లాపూర్: పట్టణంలోని గాంధీహైస్కూల్‌లో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జి ఆర్‌వీఎస్ఎస్ మిధున్‌తేజ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి, ఏఎస్ఐ రామ్మూర్తి, న్యాయవాదులు ఆర్ కురుమూర్తి, మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



మన్ననూర్: బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు శుక్రవారం అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో చత్రునాయక్, కొయ్యల శ్రీను, సాయి, శ్రీనివాసులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరంలో కొన్ని రోజుల కిందట ఎస్సీ, బీసీ కుటుంబాలకు చెందిన వారు గొడవ పడగా ఇరువురు ఫిర్యాదు చేయగా బీసీ వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయింది. ఈ మేరకు నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ గ్రామానికి చేరుకొని బాధితులు, ప్రత్యక్ష సాక్షులను, గ్రామస్తులతో వివరాలు అడిగి విచారణ చేపట్టారు. కొల్లాపూర్ సీఐ మహేష్, పలువురు ఎస్ఐలు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల ధర్నా

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని జేపీనగర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు బోధించేందుకు అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విద్యార్థులు ధర్నా చేపట్టారు. 10 మంది అధ్యాపకులకు ముగ్గురే ఉన్నారని వాపోయారు. తెలుగు, బొటనీ, ఫిజిక్స్ సబ్జెక్టులకు మాత్రమే అధ్యాపకులు ఉన్నారని మిగతా సబ్జెక్టులకు లేక చదువులో వెనకబడుతున్నామన్నారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు జోనల్ ఇన్‌చార్జి రజినీకి సమస్యను వివరించారు. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు.

కనీస వేతనం చెల్లించాలి



ఉప్పునుంతల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీలో లక్ష్మీ నరసింహా సర్వీసెస్ ఏజెన్సీ కాంట్రాక్టర్ మాత్రం సిబ్బందికి కేవలం రూ. 10 వేతనం ఇస్తూ పీఎఫ్, ఈఎస్ఐ తదితర వసతులు కల్పించకుండ నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆయన ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్, ఆస్పత్రి కార్మికులు జ్యోతి, తిరుపతమ్మ, సంధ్య, రేణమ్మ, శైలజ, చంద్రమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య బృందం పర్యటన



లింగాల: మండలంలోని ఆయా గ్రామాల్లో సీహెచ్‌సీ ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం వైద్య బృందాలు పలు గ్రామాల్లో పర్యటించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఎంపీడీఓ ఆంజనేయులు ఇతర అధికారులు మండలంలోని లింగాల, శ్రీరంగాపూర్, అప్పాయపల్లి తదితర గ్రామాలను సందర్శించారు. ఎర్రపెంటలో రెండోరోజు మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివశంకర్, ఎంపీఓ చంద్రశేఖర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పనిచేయాలి



కల్వకుర్తి టౌన్: క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ మహామూద్ షేక్ సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మున్సిపాలిటీలోని అన్ని విభాగాల సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో అత్యంత కీలకమైన రెవెన్యూ విభాగంలో ఆస్తిపన్నుల వసూలు, ఇతర వసూళ్లు 100 శాతం పూర్తి చేయాలన్నారు. ట్రేడ్ లైసన్సులు, ఇతర వ్యాపార అనుమతులను ఖచ్చితంగా తీసుకోవాలని, బిల్ కలెక్టర్లు వాటి నిర్వహణను సరిగ్గా చేయాలని సూచించారు. అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలను చేపడితే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. అనంతరం వార్డులలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమావేశంలో మేనేజర్ రాజకుమారి, సీనియర్ అకౌంటెంట్ హిమబిందు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ నిర్మాతలు జర్నలిస్టులు



కల్వకుర్తిరూరల్: సమాజ నిర్మాతలు జర్నలిస్టులు బీజేపీ రాష్ట్ర నాయకుడు గుర్రాళ్ల రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం జర్నలిస్టు డే సందర్భంగా పట్టణంలో పాత్రికేయులకు ఆయన సన్మానించారు. ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలికితీయాలని సూచించారు. బీజేపీ నాయకులు శేఖర్‌రెడ్డి, కృష్ణగౌడ్, నర్సింహ, చందు ముదిరాజ్, బాబీదేవ్, రాజశేఖర్, చింటూ పాల్గొన్నారు.

డీఎంకు వినతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థినులతో కలిసి డీఎం ఉమశంకర్‌కు వినతి పత్రం ఇచ్చారు.

తాడూరు: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో కూలిపోయిన ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

తెలకపల్లి: పంట నష్టపరిహారాన్ని చెల్లించాలని సీపీఎం నాయకుడు ఆర్ శ్రీనివాసులు తహసీల్దార్ పాండుకు వినతిపత్రం అందజేశారు.

సైబర్‌మోసాలపై కేసులు నమోదు

బల్మూర్: మాయమాటలతో ఇద్దరి యువకుల బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు కొట్టేసిన సంఘటనపై శుక్రవారం వేర్వేరుగా రెండు కేసులు నమోదు అయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన మేముల శంకర్‌కు, అదే గ్రామానికి చెందిన గుడెల్లి రమేష్‌కు ఈనెల 3న పది నిమిషాల వ్యవధిలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. మీ గ్రామానికి చెందిన మిట్టకడుపుల బీమయ్యకు చెందిన ఇన్సూరెన్స్ డబ్బులు మీ ఖాతాలో వేయమన్నాడని సైబర్‌నేరస్తులు తెలిపారు. అంతకుముందే బీమయ్యకు ఫోన్‌చేసి ఇన్సూరెన్స్ డబ్బులు ఇతరుల ఖాతాల్లోకి వేస్తామని నమ్మించారు. ఇదిలా ఉండగా ఇద్దరు యువకులు వేర్వేరుగా బీమయ్యను అడిగి నిర్ధారణ చేసుకున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు చెప్పిన విధంగా యూపీఐ నంబర్‌ను ఫీడ్ చేసుకోగా శంకర్ బ్యాంక్ ఖాతాలోనుంచి రూ. 25 వేలు, అదేవిధంగా రమేష్‌కు చెందిన బ్యాంక్ ఖాతాలోనుంచి రూ. 92120లు ఒకసారి, రూ. 7 వేలు మరోసారి డెబిట్ అయ్యాయి. దీంతో బాధిత యువకులు వెంటనే తమకు చేసిన ఫోన్‌నంబర్‌కు తిరిగి కాల్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. దీంతో మోసపోయినట్లు గ్రహించి యువకులు పోలీసుకులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.